# అలౌకిక బంధం

● అనంత రామచంద్రయ్య ●

**సాయంకాలం అయిదు గంటలయింది.**

**చిన్న పెంకుటింట్లో మినుకు మినుకుమని వెలుగుతున్న దీపం ప్రక్కన, పైట కొంగు నేల మీద పరుచుకొని పడుకున్న ఊర్మిళగారి మనసంతా స్కూల్‌కెళ్ళిన అమ్మాయి ఆధిత్య మీదే వుంది.**

నిమిషాలు లెక్కపెడుతూ ఎగాదిగా అటు ఇటు ఎదురు చూస్తు వుంది. ఆమె మొహం మీద దిగులు భయం తాలుకు ఛాయలున్నట్టు కనిపిస్తున్నాయి.

"అమ్మా! నేను స్కూల్‌కెళ్తున్నాను" అంటు వెళ్ళింది ఆధిత్య

"ఆ స్టూల్ పైన టిఫిన్ క్యారియర్ పెట్టాను తీసుకెళ్ళమ్మా" అంది ఊర్మిళ.

ఉదయం వెళ్ళిన ఆధిత్య సాయంత్రానికైన తిరిగి ఇంటికి రాలేదు. నిమిష నిమిషానికి ఆమె మనసులో నెమ్మదిగా కంగారు మొదలైంది.

మనసు పరివరి విధాల పోతుంది.

ఆరు కావస్తుంది అమ్మాయి రాలేదు.

ఏమై ఉంటుంది? ఎందుకు రాలేదు?

ఈ యక్ష ప్రశ్నలు ఆమె హృదయంలో దోబూచులాడాయి.

ఆమె చూపులు ఒక్కవైపు నిలవడం లేదు.

ఎవరైన మాయమాటలు చెప్పి తీసుకెళ్ళలేదు కదా... అనే ఆ ఆలోచన రాగానే గుండె ఆగినంత పనయింది ఆమెకు.

నా బిడ్డను కాపాడమని శ్రీ మన్యం కొండ స్వామిని కోరుకుంది మనసులో.

దారిలో నడచి వస్తుంటే ఏ మోటర్ గాని... ఆ ఆలోచన రాగానే గుండె వేగం పెరిగింది. ఉన్నపలంగా లేచి, ఇంటికి తాళం వేసి రోడ్డున పడింది. ఎడారిలో బాటసారి నీడ కోసం, నీటి చలమకోసం గాలిస్తున్నట్టు, ఆశగా చూస్తూ బరువుగా అడుగులు వేస్తుంది ఊర్మిళ.

ఎవరైన తెలసిన వాళ్ళు కనిపిస్తారేమో... అమ్మాయి గురించి అడగాలని ఆమె మనసు తహతహ లాడిపోతుంది. కనిపించిన వారిని అడిగింది. కాని ఫలితం కనిపించలేదు. నిమిష నిమిషానికి ఆమె గుండెల్లో గుబులు పుట్టింది. మెదడులో ఆలోచన వేడెక్కి పోతుంది. గొంతు తడారిబోతుంది. కనిపించిన గుడి గోపురాలను మ్రొక్కుతుంది.

పసిపిల్లలు ఎవరైన తమపట్ల ఏ మాత్రం ప్రేమ చూపించినా వెంటనే ఆవైపు ఆకర్షితులౌతారనే భావన లోలోన ఆమె హృదయాన్ని కృంగదీసింది. "అలాంటిది కాదు మా అధిత్య" అంటూ తన్ను తాను సమర్థించుకుంది. ఏ నిమిషంలోనైన కనిపించకపోతుందా... అంటు తమాయించుకుంది. చూసి చూసి, తిరిగి తిరిగి అనుకోకుండ ఇంటికి చేరి, అచేతనంగ ఇంటి గుమ్మంపై కుప్పకూలి పోయింది ఊర్మిళ.

❀ ❀ ❀

ఆ రోజు ఆధిత్య ఎప్పటిలాగా స్కూల్ నుండి ఇంటికి తిరిగి వస్తుండగా రాజేష్ అనే అతను దార్లో అనుకోకుండ తారసపడ్డాడు. ఏదో తొందర పనున్నవాడిలా చాలా వేగంగా సైకిల్‌పై వెళ్ళి ఓ మలుపు తిరుగుతున్న ఆధిత్యను ఏ మాత్రం చూసుకోని వాడిలా ఢీ కొట్టాడు. అంతే ఆధిత్య దభాల్న క్రిందపడిపోయింది. రాజేష్ ఒక్కసారిగా కంగారుపడిపోయిన వాడిలా తత్తరబాటులో ఆ బేబిని చటుక్కున లేవదీశాడు.

అరెరే... అయాం సారీ పాప! దెబ్బ తగిలిందా అంటు అనునయంగా అడిగాడు. అనుకోకుండా జరిగిపోయిన సంఘటనకు ఆధిత్య బిక్కమొహం పెట్టి దెబ్బ తగలలేదన్నట్లుగా తల అడ్డంగా వూపింది.

రాజేష్ చాలా ప్రేమ ఒలకబోస్తు, ఆమెను మృదువుగా తలని నిమురుతూ ప్రేమ పూర్వకంగా నవ్వాడు. అతని ముఖంలో చిరు

● ● ●

**అనుకోకుండా జరిగిన సంఘటనకు ఆదిత్య బిక్క మొహం వేసింద.**

● ● ●



నవ్వును చూసి తనూ ముద్దుగా నవ్వింది. "పాప... మీ ఇల్లెక్కడా?" అన్నాడు రాజేష్ చనువుతో.

"కొద్ది దూరంలో[illegible]ంది అంకుల్" అంది బేబి ఆధిత్య.

"అయితే కాస్త కాఫీ పుచ్చుకొని వెల్దువు పద బేబీ" అన్నాడు రాజేష్.

"వద్దు అంకుల్... నే వెళ్తాను. నా కోసం అమ్మ ఎదురు చూస్తుంటుంది" అంది ఆధిత్య.

"ఫర్వాలేదు రా బేబి" అంటూ ఆమె చెయ్యి పట్టుకొని వీధిలో ఉన్న కాఫీ కొట్టుకు తీసుకెళ్ళాడు. ఆధిత్య ఒక్క క్షణం తటపటాయించినా... రాజేష్ మృదువుగా ఆమెను బుజ్జగిస్తూ, ఒప్పించి కాఫీ త్రాగించబోయ్యాడు. ఆ కొట్టులోనే ఓ మూలకు కూర్చున్న ఓ బాటసారి వారి తీరును గమనిస్తూనే వున్నాడు. అతను ఏదో పోగొట్టుకున్నవాడిలా గోచరిస్తున్నాడు. మాసిన బట్టలు, పెరిగిన గడ్డం చూసేవారికి అతను ఓ బిక్షగాడిలా అగుపిస్తాడు. అయినా... ఆ అమ్మాయిని మాత్రం ఎగాదిగానే చూస్తున్నాడు. బేబి అయిష్టంగానే కాఫీ త్రాగుతుంది. అప్పటి వరకు ఎంతో హుషారుగా కూర్చున్న ఆధిత్య కళ్ళు క్రమంగా మూతలు పడసాగాయి. "నిద్రొస్తుందంకుల్" అంటూ బరువుగా వాలిపోతున్న కనురెప్పల్ని తెరవడానికి ప్రయత్నిస్తూ అంది.

"అయితే నా తొడపై పడుకో" అన్నాడు రాజేష్ తటపటాయిస్తూ.

అతనా మాట పూర్తి చేసే లోగానే, ఆధిత్య ఎలా కూర్చున్నదలాగే కుర్చిపైనే, వాలిపోయింది. అదే అదనుగా ఆధిత్య చెవి బంగారు రింగులు కాజేయబోయ్యాడు. ఇదంతా గమినిస్తున్న ఆ బాటసారి ఆతృతతో అతని కాలర్ లాగి ఒక్కటిచ్చాడు. అంతే అల్లంత దూరంలో పడి లేచి తన కాళ్ళకు బుద్ధి చెప్పుకున్నాడు. వెంటనే కాఫి కొట్టు యజమాని సహాయంతో డాక్టర్ గారి పర్యవేక్షణతో మళ్ళి ఆధిత్యను మాములు మనిషిగా చేయించాడు బాటసారి. బేబి ఆధిత్యకు స్పృహ వచ్చిన తరువాత...

"నీ పేరేమిటి?" అని అడిగాడు ఆ బాటసారి.

ధగా పడ్డ మనిషిలా అతన్ని చూస్తేనే భయపడిపోయింది. ఆయన అడిగిన ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా "నే వెళ్తాను అంకుల్" అంది.

"ఇంకాస్త రెస్ట్ తీసుకోవాలమ్మా! మీ ఇల్లు ఎక్కడో చెప్పు మీ అమ్మను ఇక్కడికే

తీసుకొస్తాను" అన్నాడు ఆ బాటసారి. "వద్దు అంకుల్ నేను వెళ్తాను నీకు నమస్కరిస్తాను అంకుల్ నన్ను పోనివ్వు" అంటూ చేతులు జోడించి నమస్కరిస్తూ అంది అధిత్య.

ఆ మాటకు అతడెంతో పశ్చాతాపపడ్డాడు.

"బేబి... నేను మీ తండ్రిలాంటి వాణ్ణి నేనొకప్పుడు నువ్వు అనుకున్నట్టే కిరాతకుణ్ణే. నా చేతులారా నా దేవతను పోగొట్టుకున్నాను. ఇప్పుడు ఆ దేవత కోసం గాలిస్తున్నాను.

అయిన ఈ విషయం నీకెందుకులేమ్మ నిన్ను మీ అమ్మకు అప్పగించి నే వెళ్తాను. ఈ పుణ్యకార్యమైన చేసి నా జన్మను సార్థకం చేసుకుంటాను" అని దీనంగా అన్నాడు ఆ బాటసారి. అయినా అతని ఊరడింపుకు పాప అయిష్టంగానే సరే అని తల ఊపింది. అతను కృతజ్ఞత భావంతో బేబి తలను నిమిరాడు. పాప స్వేచ్ఛగా, నిర్భయంగా నిద్రపోయింది.

❀ ❀ ❀

నిద్రలో మునిగిన ప్రజలను లేపటానికి మసీదులో హాజరత్, అల్లహో అక్బర్ అంటూ గొంతెత్తి పిలుస్తున్నాడు.

ఎక్కడో గుడి గంటలు మ్రోగుతున్నాయి.

దేవాలయ పసిడి వాకిలి ముందు పూజారులు సుప్రభాత గీతకలలో దేవున్ని స్తుతించుచున్నారు. అంతలో తూర్పు తెల్లబడి, మానవ కోటికి జీవనాధారమైన వెలుగు పైకొచ్చింది. అగ్నిలాంటి ఆ వెలుగులో పాపం, పటాపంచలైనట్టు, చీకటి నలుమూలలలో నక్కిపోయింది. ఇంటి గుమ్మంపై సొమ్మసిల్లి పడివున్న ఊర్మిళపై, వెచ్చగా సూర్యకిరణాలు ఏటవాలుగా పడ్డాయి. ఆమె కళ్ళు జెలదరించింది. కళ్ళలో భయాన్ని మనసులో. ఆందోళనని నింపుకొని చెప్పుకునేందుకు ఎవరూ లేక అస్తవ్యస్తంతో పడివున్న ఊర్మిళకు అమ్మా! అనే కేక వినిపించింది.

ఎదురుగా ఉన్న అధిత్యను చూసి, వెయ్యి ఏనుగుల బలం పుంజుకుని అరక్షణంలో లేచి నిలబడ్డ తన బిడ్డ అధిత్యను తన గుండెకు అత్తుకుంది. ఆ క్షణం ఆమె హృదయంలో ఆనందం పొంగిపొర్లింది.

"ఎక్కడకెళ్ళావమ్మా!" అంటూ తన పైట కొంగుతో అధిత్య మొహాన్ని తుడుస్తూ, అక్కడే నిలబడ్డ ఆ బాటసారిని చూసింది. ఆమె గుండె గుభేలుమంది. కళ్ళ వెనుక కన్నీటి కుండలు భళ్ళున బ్రద్దలయ్యాయి. ఆమె ముఖం వెయి ఓల్టేజి బల్బులా వెలిగింది. అతని వంక సూటిగా చూసింది. అతని వదనంతో కాంతి దోబూచులాడింది.

## ●●● వయస్సు పెరుగుతున్న కొద్దీ బంధాలు కూడా పెరుగుతుంటాయి ●●●

ఊర్మిళను చూసి గుర్తు పట్టినపుడే ఆ బాటసారికి ఓ పెద్ద విద్యుత్ కాంతిని చూసినట్టు ఫీల్ అయ్యాడు. వారి చూపుల మధ్య నిశ్శబ్దం కొంతసేపు రాజ్యమేలింది. ఇద్దరు ఏదో ఆలోచిస్తున్నారు. ఊర్మిళ ఏదో... చెప్పాలనుకుంటుంది. కాని చెప్పలేకపోతుంది. ఆమె హృదయంలో ఏ భావముందో సరిగ్గా తెలియటం లేదు. ఇద్దరూ గతాన్ని నెమరు వేసుకుంటున్నారు. గత మనస్పర్ధలకు తామెంత వరకు కారకులమని బేరీజు వేసుకుంటున్నారు. సరిగ్గా ఆ సమయానికే తలెత్తి చూసిందామె. అంతలో గత స్మృతులు జ్ఞావకం వచ్చాయి ఊర్మిళకు.

❀ ❀ ❀

ఊర్మిళ ఓసారి స్నేహితురాలు పెళ్ళికి వెళ్ళి అనుకోకుండా రంగనాధం అనే ఓ ఉద్యోగికి పరిచయమయింది. ఆ పెళ్ళి హడావిడిలో, జనం సందుల్లో నుండి, దొంగ చూపులు చూస్తూ, ముసి ముసి నవ్వుల్తో, ఒకరినొకరు చిందులు త్రొక్కారు. అతని చూపుల్లో ఆమె చూపులు కలిపింది. ఆ చూపుల్లో ఏదో కాంతి కొట్టొచ్చినట్టు, పెదవుల్లో విరహం పుట్టిపడినట్లుండేది. రంగనాధం ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ, చుక్కల్లో చంద్రుడిలా ఉంటాడు. పరిచయం కాగానే అతని మీద ఆమెకు ఓ అవినాభావ సంబంధం ఏర్పడింది. వారి మతాలు వేరైనా, వారి మమతులు, మనస్తత్వాలు, అభిరుచులు, వారి దృక్పధాలు ఒకేలా వున్నాయి.

ఊర్మిళ కూడా ముద్దబంతి పువ్వులా ఉంటుంది. బంగారపు చాయ, పెద్ద కళ్ళు, నవ్వితే సొట్టలు పడే నున్నని బుగ్గలు, అందంగా వుంటుంది. ఆమెను చూస్తున్నప్పుడల్లా మల్లె మొగ్గలు గుర్తుకొస్తాయి. ఎవరికైనా, ఆమె నవ్వు, మల్లెమొగ్గల్లాగే పక్కుమంటాయి. ఆ క్షణంలో వారి చూపులు ఒక్కసారిగా విడిపోలేనివిగా కలుసుకున్నాయి. ఎవరైనా చూస్తున్నారా? అన్న ఆలోచన కూడా ఆ సమయంలో కలగలేదు. రంగనాధం చేతులు అధిత్య చేతులను తాకాయి. ఆమె చేతుల్లోకి పూల మాలను అందిస్తున్న భావన కాని, వారివరికి రాలేదు. మైకంలో పడ్డ వారి మేనులు జలదరించింది. మాల క్రింద పడకముందే అందుకొని ఊర్మిళ జడలో తురిమాడు రంగనాధం. బంధం అనేది సంకెళ్ళ వంటిది. అయితే మనసుల మధ్య ఉండే కొన్ని బంధాలు తెగని, తెంచుకోలేనివి. వయస్సు పెరుగుతున్న కొద్దీ బంధాలు కూడా పెరుగుతుంటాయి. ఏకాకిగా పుట్టిన మనిషికీ, మధ్యలో అల్లుకునే బంధాలు ఎన్నో. అలాంటిదే వీరిది. అలౌకిక బంధం. ఎలాగో వీరికి వైభవంగా పెళ్ళి జరిగింది.

ఇక ఆమె తన భవిష్యత్తును గురించి బంగారు కళలు కంది. ఊర్మిళ తండ్రి కాంతారావు, తన తాహతు కొద్దీ కుమార్తెకు అలంకారాలతో, కొద్దిపాటి అభరణాలతో, ఒక ఎకరం భూమి కట్నంగా రాసిచ్చాడు. అంతేకాదు, రాసిచ్చిన ఎకరం భూమిని నేనే సాగు చేస్తూ, దానిపై వచ్చే ఫలసాయాన్ని డబ్బు రూపకంగా ఆ మొత్తాన్ని కుమార్తె పేర బ్యాంక్‌లో జమ కట్టిస్తానన్నాడు. అందుకు అగ్రహించాడు. అలక పాన్పులో అలక వహించాడు రంగనాధం. అది మొదటి రాత్రి ఊర్మిళకు. అహ్లాదకరమైన ఆ సమయంలో, విశ్వామిత్రుడి తపోబంగంలా ఊర్మిళ చెవుల్లో ఉదయ సైరన్ మ్రోగాయి. అపర కీచకుడిలా ఆమెను చూశాడు రంగనాధం. "ఒక మాట అడగనా!" అన్నాడు రంగనాధం. ఏమిటన్నట్లు కళ్ళతో చూసింది ఊర్మిళ.

"నీకిది నిజంగా మొదటి రాత్రేనా!?" అడిగాడు వ్యంగ్యంగా.

"ఛీ!" అంటూ మనసులో అనుకుంది. ఎవరో తన గుండెను బైటికి లాగినట్టుగా అనిపించింది. "మర్రి చెట్టు క్రింద మల్లెతీగ పెరగదన్నట్టు నీ చేతులో నే బ్రతకలేను. నీకు అందమైన ముఖం వుంది. కాని, అందమైన మనసు లేదు" అంది నిక్కచ్చిగా.

అతని అనుమానాలు, ఆంక్షలు, సూటిపోటి మాటలు భరించలేకపోయింది ఊర్మిళ. వెంటనే అతని నుండి దూరమైంది.

గడచిన ఆ విషాద సంఘటన ఇంకా మదిలో మెదులుతూనే ఉంది. కళ్ళల్లో నీళ్ళు ధారపతంగా కురుస్తున్నాయి. అతన్ని పెళ్ళి చేసుకున్న ఖర్మానికి, ఈ ఆరేళ్ళ పాపే నిదర్శణం.

జరిగిపోయిందాన్ని గురించి ఆరేళ్ళు ఊర్మిళ ఒక్కసారి కూడా బాధపడలేదు. ఇంతకాలం పాపతో ఒంటరిగా బ్రతికింది. ఏడేళ్ళు ముడుచుకుపోయిన ఆమె మనసు ఇప్పుడు మెల్లగా విచ్చుకుంది. ఈ కాలంలో స్త్రీకి నీడ లేకపోయిన, నేటి పరిస్థితుల్లో తోడు అవసరం అనుకుంది. తత్తరపడే పెదవులతో "ఏమండీ!" అంది ఊర్మిళ గద్గదస్వరంతో.

ఆ మాట విన్నాక రంగనాథం గుండె బరువెంతో తగ్గిపోయినట్టు, ఆలోచనలు అన్నీ ఆవిరైపోయినట్టు, మనసు మేఘాల్లో తేలిపోతున్నట్టు అన్పించింది రంగనాథానికి.

"మల్లె తీగకు ముళ్ళకంచె అవసరమన్నట్టు, భార్యకు తోడు భర్తేనండి. భర్తకు దూరమైన ఆడదాని జీవితం, సూర్యుడు లేని ఆకాశం వంటిదని నేను తెలుసుకున్నానండి. మీరు నన్ను ఎలా హింసించినా నే భరిస్తానండి" అంటూ భర్త రంగనాథం కాళ్ళపై పడి బోరున ఏడ్చింది ఊర్మిళ. అతడు తన చేతుల్తో ఆమె ముఖాన్ని తన వైపుకి తిప్పుకొని "మనం దూరమైన మన మనసులు దూరం కావు ఊర్మిళ. మనది జీవనరాగం" అంటూ ఊర్మిళను గుండెకు హత్తుకున్నాడు.

"అధిత్యా! మీ నాన్న గారమ్మా!" అంటూ పరిచయం చేసింది పాపకు.

"పాప!" అంటూ అధిత్యను ఎత్తుకొని ముద్దులాడాడు రంగనాథం.

ఊర్మిళ! కలసిన మనసులకు ఏ మతాలు అడ్డురావు. గతంలో నా ప్రవర్తన నీకు బాధ కలిగించవచ్చు. అయినా మగవాడు ఆస్తి లేకుండా, అంతస్తు లేకుండా బ్రతకవచ్చుకాని, అనురాగం పంచే ఓ స్త్రీమూర్తి లేకుండా బ్రతకలేడు. అదినే నేర్చుకున్న గుణపాఠం. నన్ను క్షమించు ఊర్మిళ" అన్నాడు.

"నువ్వు ఇక్కడికొచ్చి ఎన్నాళ్ళయ్యింది?" అడిగాడు రంగనాథం, మిళితమైన ఆవేదనతో... ఊర్మిళ ఇలా చెప్పసాగింది.

"నన్ను వీడిన తర్వాత నేనొంటరి దాన్నయ్యాను. బ్రతుకు తెరువు కోసం హైద్రాబాద్‌కు వచ్చాను. అప్పుడే నేను ఓ బిడ్డకు తల్లిని కాబోతున్నాను. అలా తొమ్మిది మాసాలు గడిపాను. అంతలో ఈ హైద్రాబాద్‌లోనే ఓ మరువురాని సంఘటనలు జరిగాయి. అదొక దారుణకాండ, దహనకాండ, హత్యాకాండ, నాకిప్పటికీ ఆ విషాదఘటన ఇంకా మదిలో మెదలుతూనే వుంది. ఎవరో చంపబడ్డారన్న కక్షలతో, మత సంఘర్షణ, మౌఢ్యాలతో మన కాలనీపై గుర్తు తెలియని ఆగంతకులు వాహనాలలో వచ్చి దహనకాండ, హత్యాకాండ జరిపారు. వారి కిరాతక చర్యలకు ఆ వాడలోని వారందరు హత్యలకు గురయ్యారు. ఎటు చూసినా హాహాకారాలు, బ్రతికుంటే బలుసాకైనా తిని బ్రతకవచ్చునని ప్రవచించిన నేను అరచేతుల్లో మా ప్రాణాలు పెట్టుకొని పరుగు తీశాను. ఆ కిరాతకుల ఆగడాల నుండి కమ్ముకున్న పొగలను ఛేదించుకుంటూ, ఇల్లు కోల్పోయిన నేను పసిపాపతో హైద్రాబాద్‌ను విడిచి పాలమూరుకొచ్చాను" అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది.

ఏలాగైతేనేం! కలుసుకున్నాం అంది ఆనందభాష్పాలతో.

ఇది 'అలౌకిక బంధం' అంటూ ఆ దంపతులు భగవంతున్ని మనసారా మ్రొక్కారు.


మొదట పరీక్షించండి

తెల్ల మచ్చలకు చికిత్స



నిరంతర శ్రమ ఆవిష్కరణ తరువాత తెల్ల మచ్చలకు మందు కనుగొనబడినది. వైద్యము ప్రారంభించిన కొద్ది దినములకే మచ్చయొక్క రంగు మారి నెమ్మదిగా శరీరపురంగులో కలిసి పోవును. "మొదట పరీక్షించి చూడండి" స్కీముకింద 7 రోజుల మందు ఉచితముగా మీకు ఇవ్వబడును. రకరకాల ఒక్కసారి మందులు వాడి నిరాశ చెందినచో మా మందు వాడిచూడండి రోగివయస్సు మరియు మచ్చయొక్క పూర్తి వివరములు వ్రాయండి.

Gaya Ayurved Bhavan (M-93)
P.O. Katri Sarai (Gaya)

జుత్తు రాలుట, తెల్లబడుటకు చికిత్స



చిన్న వయస్సులోనే ఏదైనా కారణము చేత జుత్తురాలుట లేదా తెల్లబడినచో చింతించవద్దు. ప్రాచీన ఆయుర్వేద గ్రంధములను చేసి అధ్యయనము తయారు చేయబడిన మా మందు ఉపయోగించిన తరువాత జుత్తురాలుట మరియు నెరయుట తగ్గును మరియు క్రొత్త వెంట్రుకలలో జుత్తునల్లగా దట్టముగా పెరుగును. మా మందు మెదడును చల్లపరుచును జ్ఞాపక శక్తిని పెంపొందించును, రోగి యొక్క వయస్సు చిరునామాకు క్రింది మరియు వివరములతో వ్రాయుము.

Treatment cost Rs.100/-; Special Course Rs.150/-

GAYA AYURVED BHAVAN (MT.) P.O. KATRI SARAI (GAYA)

జ్యోతిష్యం యొక్క చమత్కారం

కష్టాలను హరించే సిద్ధి ఉంగరం

దీన్ని ధరించినా లేక దగ్గర పెట్టుకొన్నా ఏ స్త్రీ లేదా పురుషుని పేరు స్మరిస్తారో, వారు ఎంతటి పాషాణ హృదయులయినప్పటికీ మీ పాదాల చెంతకి రాగలరు. వ్యాపారంలో లాభం, దావాలో గెలుపు, పుత్రయోగం, పరీక్షలో ఉత్తీర్ణత, పెద్ద ఉద్యోగం, కోరుకున్న వివాహం ప్రాప్తి కాగలదు. ఇంట్లో అశాంతి, రోగాలు క్షణంలో దూరం కాగలవు, నలుమూలలా సంతోషమే. తాంత్రిక ఉంగరం రూ. 51/- మీ పేరు మీద మంత్రించబడిన ప్రత్యేక వెండి ఉంగరం రూ. 151/- ప్రత్యేకమైన వెండి బంగారపు మిశ్రమ ఉంగరం రూ. 275/-

*SANKAT HARAN ASHRAM (W)*
P.O. Maira Barith (Gaya)